సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 27 । జూలై । 2024



టీడీపీ దాష్టీకానికి వైఎస్సార్ సీపీ నేత బలి

8లో


టీడీపీ దాష్టీకానికి పెద్దాపురం వైఎస్సార్ సీపీ ఒక చురుకైన నాయకుడిని కోల్పోయింది.



రూ.2 లక్షల విరాళం

హనుమాన్ జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానానికి వేళ్లపాలెం సాయి నిఖిల్‌రెడ్డి (రాజమహేంద్రవరం) శుక్రవారం రూ.2 లక్షల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 5,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 5,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,500, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ప్రజలకు రక్షణ కల్పించడమే ధ్యేయం



పోలీసులకు గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజలందరికీ రక్షణ కల్పించడమే పోలీసుల ప్రధాన ధ్యేయమని, ఇందుకోసం సమన్వయంతో పని చేయాలని ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఆర్మ్‌డ్, సివిల్, ట్రాఫిక్ పోలీసులు, హోంగార్డులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. వ్యాయామం, యోగాపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారుల సహాయంతో వైద్యం పొందాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీ రవికుమార్, జోనల్ డీఎస్పీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

జీఓ 117 రద్దు చేయాలి



ఉపాధ్యాయులను కలసిన యూటీఎఫ్ నేత జయరాజ్

నల్లజర్ల: జీఓ నంబర్ 117ను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియాలు ప్రవేశపెట్టాలని, ప్రాథమిక పాఠశాలల్లో 1–5 తరగతులు ఉండేలా చూడాలని యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీపీ జయరాజ్ మండలంలోని వివిధ పాఠశాలలను శుక్రవారం సందర్శించి ఉపాధ్యాయులను కలుసుకున్నారు. ప్రకాశరావుపాలెం హైస్కూలులో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి రెండు రకాల పరీక్షలు నిర్వహించడాన్ని యూటీఎఫ్ ఖండిస్తోందన్నారు. కొన్ని పాఠశాలల్లో సీబీఎస్ఈ, మరికొన్ని పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ నిర్వహిస్తుండటంతో విద్యా వ్యవస్థలో గందరగోళం ఏర్పడిందన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్‌పీలు, ఎంఎస్ కో ఆర్డినేటర్లు చేయాల్సిన పనులను ఉపాధ్యాయులతో చేయిస్తూ ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. పదో తరగతి తప్పిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్చుకొని ఉపాధ్యాయులే పరీక్ష ఫీజు చెల్లించే విధానాన్ని రద్దు చేయాలని జయరాజ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు మనోహర కుమార్, ఎస్.భవాని, మండల శాఖ అధ్యక్షులు అలీ అహ్మద్, బండి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ టీచర్ దరఖాస్తులకు 7 వరకూ గడువు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్ వెల్ఫేర్ అవార్డులకు దరఖాస్తులు సమర్పించాలని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు అర్హులన్నారు. ఎంఈఓ పరిధిలోని పాఠశాలల నుంచి ఒక సెకండరీ గ్రేడ్ టీచర్, తత్సమానమైన టీచర్, ఒక ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే, ఉప విద్యాశాఖాధికారి పరిధిలోని పాఠశాలల నుంచి ఒక స్కూల్ అసిస్టెంట్, తత్సమానమైన ఉపాధ్యాయుడు, ఒక హెచ్ఎం అర్హులని తెలిపారు. నిర్ణీత నమూనాలో ఆగస్టు 7వ తేదీలోగా సంబంధిత తనిఖీ, మండల కమిటీ, డివిజనల్ కమిటీల ఆమోదంతో దరఖాస్తులు అందించాలని సూచించారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు తిరస్కరిస్తామన్నారు. దరఖాస్తు నమూనాను ఎంఈఓలకు, ఉప విద్యాశాఖాధికారులకు మెయిల్ చేశామని తెలిపారు.

ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారు పండించే పంటలకు తగిన ధరలు అందేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. 2024–25లో పొలంబడి, గుడ్ అగ్రికల్చర్ ప్రాడక్ట్ సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌పై కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పొలంబడి కార్యక్రమాలను గ్రామం యూనిట్‌గా చేపట్టాలన్నారు. రైతులను, మార్కెటింగ్ వర్గాలను భాగస్వాములుగా చేయడం వల్ల అనుకున్న ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

బదిలీలకు ప్రదక్షిణ!



'పవర్' పాలి'ట్రిక్స్'!

- హాట్ కేక్‌లా మారిన ఈపీడీసీఎల్ ఎస్ఈ సీటు
- దక్కించుకునేందుకు ఆరుగురు అధికారుల ప్రయత్నాలు
- టీడీపీ నేతల చుట్టూ చక్కర్లు
- విద్యుత్ శాఖలో బదిలీలకు ముమ్మర కసరత్తు

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీ ఈపీడీసీఎల్)లో బదిలీలు, పదోన్నతులకు రంగం సిద్ధమైంది. పెద్ద ఎత్తున స్థానచలనాలు ఉంటాయనే చర్చ ఆ శాఖ ఉద్యోగుల్లో విస్తృతంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో కోరుకున్న స్థానం దక్కించుకునేందుకు ఎవరి స్థాయిలో వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు 'అన్ని' ప్రయత్నాలూ చేస్తున్నారు. తమకున్న పరిచయాలు, పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. భారీ స్థాయిలో డబ్బు ఆఫర్ చేస్తున్నారు.

అ'ధనం' కోసం ఆత్రం!

ఈపీడీసీఎల్ బదిలీల్లో రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ సీటు హాట్ కేక్‌లా మారింది. ఈ సర్కిల్‌లో రొయ్యల చెరువులు, హెచ్‌డీ సర్వీసులు, పరిశ్రమలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ఇక్కడ విద్యుత్ సరఫరా వ్యవస్థ అత్యంత కీలకం. దీని పరిధి సైతం విస్తృతం. అలవాటు పడిన చేతులైతే ఇక్కడ స్థాయిని బట్టి కొంత మంది అధికారులకు ప్రతి నెలా రూ.లక్షల్లో సంపాదించుకునే అవకాశముంటుందని సిబ్బందే స్వయంగా చెబుతున్నారు. ఇలా అ'ధనం' వచ్చే అవకాశం ఉండటంతో రాజమహేంద్రవరం ఎస్ఈ సీటును ఎలాగైనా కైవసం చేసుకునేందుకు ఆరుగురు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖ కార్పొరేట్ కార్యాలయం నుంచి నలుగురు, కాకినాడ నుంచి ఒకరు, ఏలూరు నుంచి మరొకరు ఈ ఎస్ఈ సీటుపై కన్ను వేశారు. దీనికోసం తమకున్న పలుకుబడి మొత్తం వినియోగిస్తున్నారు. పరిచయం ఉన్న టీడీపీ నేతలను ఆశ్రయిస్తూ పైరవీలు చేస్తున్నారు. నేతల చుట్టూ పదేపదే ప్రదక్షిణలు చేస్తున్నారని సమాచారం. వీరిలో మాజీ మంత్రి జవహర్‌కు సన్నిహితులు ఒకరు, సీఎం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వారు మరొకరు ఉన్నారని అంటున్నారు. వీరిద్దరి మధ్య ఈ సీటు కోసం తీవ్ర పోటీ నెలకొందని చెబుతున్నారు.

విశాఖ కార్యాలయంపై కన్ను

రాజమహేంద్రవరం సర్కిల్‌లో సుమారు మూడున్నరేళ్లుగా పని చేస్తున్న ఓ అధికారి ప్రస్తుతం పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారు. ఆయన విశాఖలోని ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎం (ఆపరేషన్ కన్జ్యూమర్ సర్వీసెస్ (ఓఅండ్‌సీఎస్)) పోస్టు దక్కించుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని పలువురు టీడీపీ ఎమ్మెల్యేలతో సిఫారసు చేయిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పోస్టుకు అత్యంత డిమాండ్ ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, సామగ్రి సరఫరా తదితర కీలక అంశాల్లో ఈ స్థాయి అధికారి పాత్ర కీలకం. ఉద్యోగానికి ప్రాధాన్యంతో పాటు కాసుల వర్షం కురిపించే అవకాశం ఉండటంతో ఈ పోస్టుకు కూడా తీవ్రమైన పోటీ ఉంటుంది. గతంలో ఈ పోస్టులో పని చేసి పదవీ విరమణ చేసిన ఓ అధికారి సైతం భారీగా వెనకేసుకున్నట్లు సమాచారం. తాను కట్టుకుంటున్న ఇంటికి ఒక్కో డివిజన్‌కు రూ.లక్ష చొప్పున ఐదు సర్కిళ్లలోని 70 డివిజన్ల పరిధిలో రూ.2 కోట్లకు పైగా పోగేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పోస్టు కోసం పలువురు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారని ఈపీడీసీఎల్ ఉద్యోగులే చర్చించుకుంటున్నారు.

ఇంటి కోసం భారీ ఇండెంట్ !

ఇప్పటికే రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో ఓ అధికారి కాకినాడలో కోట్ల రూపాయలతో విలాసవంతమైన గృహం నిర్మించారు. దీని కోసం భారీగా దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇల్లు కట్టుకునేందుకు లైన్ కాంట్రాక్టర్లు, మ్యాన్‌పవర్ కాంట్రాక్టర్లు, సివిల్ కాంట్రాక్టర్లకు తన సర్కిల్‌లోని దిగువ స్థాయి అధికారులకు భారీగానే ఇండెంట్ పెట్టారని అంటున్నారు. ఏలూరు నుంచి రూ.లక్షల విలువైన ఇంటీరియర్ సామగ్రి ఉచితంగా పొందారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్లు, దిగువ స్థాయి అధికారుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని ఓ కింది స్థాయి ఉద్యోగి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది. తనపై ఫిర్యాదు చేసిన సదరు ఉద్యోగిని ఆ అధికారి తన పలుకుబడితో విశాఖలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేయించారు. తర్వాత కొద్ది రోజుల్లోనే తిరిగి నర్సీపట్నం డివిజన్‌కు బదిలీ చేయించినట్లు విమర్శలు వస్తున్నాయి.



ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి సర్కిల్ కార్యాలయం

కాసేపు నిలకడగా.. ఆపై తగ్గుతూ..



బ్యారేజీ నుంచి విడుదలవుతున్న మిగులు జలాలు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి కాసేపు నిలకడగా కొనసాగుతూ.. ఆపై పెరుగుతూ.. తిరిగి తగ్గుముఖం పడుతోంది. బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయం 6 గంటలకు నీటిమట్టం 13.60 అడుగులకు చేరింది. అనంతరం స్వల్పంగా పెరుగుతూ మధ్యాహ్నం 12 గంటలకు 13.70 అడుగులకు చేరింది. అక్కడి నుంచి నిలకడగా కొనసాగుతూ రాత్రి 7 గంటలకు స్వల్పంగా తగ్గి తిరిగి 13.60 అడుగులకు చేరింది. బ్యారేజీలోని ధవళేశ్వరం, ర్యాలి, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లలోని మొత్తం 175 గేట్లను పైకి లేపి 12,58,268 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ఎగువన భద్రాచలంలో వరద ఉధృతి తగ్గడంతో తెల్లవారుజామున రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అనంతరం రాత్రి 7 గంటలకు స్వల్పంగా పెరుగుతూ తిరిగి 47.70 అడుగులకు నీటిమట్టం చేరింది. మరో రెండు రోజుల పాటు ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

గోదావరి నీటిమట్టాలు (మీటర్లలో)

కాళేశ్వరం	15.07
పేరూరు	17.35
దుమ్ముగూడెం	12.72
కూనవరం	20.21
కుంట	11.52
పోలవరం	13.04
రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి	16.67

నిరంతర పర్యవేక్షణతోనే ప్రగతి

- పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- కలెక్టర్ ప్రశాంతి



వైద్య, ఆరోగ్య అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నిరంతర పర్యవేక్షణతోనే ప్రగతి సాధ్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పాఠశాల విద్యపై సంబంధిత అధికారులతో తన చాంబర్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతులు, నిర్వహణ సామర్థ్యంపై సరైన పర్యవేక్షణ అవసరమన్నారు. విద్యార్థుల హాజరు, స్కూల్ నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు, డ్రాపౌట్లు లేకుండా వంద శాతం చేరికలు, నాడు – నేడు పనుల పురోగతిపై ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎంఈఓలు ఆకస్మిక తనిఖీలు చేసి, స్కూళ్లలో హాజరు శాతం, విద్యార్థుల సంఖ్యను పరిశీలించి, నివేదిక తయారు చేయాలని చెప్పారు. సోమవారం నుంచి స్కూళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపడతానని ప్రకటించారు. సమావేశంలో జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుభాషిణి, ఇతర విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

టీకాల లక్ష్యం పూర్తి చేయాలి

జిల్లా వ్యాప్తంగా రోగ నిరోధక టీకాల లక్ష్యం నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గర్భిణుల వివరాలు నమోదు చేసి, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల వారీగా నెలకు సుమారు ఐదు ప్రసవాలు జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్య సేవలు సమర్థంగా అందజేయాలన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య ఆసుపత్రుల్లో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించి, వెంటనే వినియోగం తీసుకుని రావాలని సూచించారు. జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. జననీ సురక్ష, మాతృశ్రీ వందనం పథకాలకు సంబంధించిన పోస్టల్ ఖాతాలు ప్రారంభించి, పథకాల ప్రయోజనం అర్హులందరికీ అందేలా చూడాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, డీఐఓ రాజకుమారి పాల్గొన్నారు.

పరిమితికి లోబడి వర్జీనియా పొగాకు సాగు

- రైతులు నియంత్రణ పాటించాలి
- టుబాకో బోర్డు విస్తరణ మేనేజర్ దామోదర్



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

దేవరపల్లి: పొగాకు రైతులు 2024–25 పంట కాలంలో పరిమితికి లోబడి మాత్రమే వర్జీనియా పొగాకు సాగు చేయాలని టుబాకో బోర్డు విస్తరణ మేనేజర్ (గుంటూరు) జి.దామోదర్ విజ్ఞప్తి చేశారు. దేవరపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది పంట దెబ్బ తినడంతో జింబాబ్వే, బ్రెజిల్ వంటి దేశాల్లో పొగాకు ఉత్పత్తి తగ్గిందన్నారు. దీంతో మన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఏర్పడి, మార్కెట్ రికార్డు స్థాయికి చేరుకుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు వచ్చే ఏడాది అధిక విస్తీర్ణంలో సాగుకు సన్నాహాలు చేస్తున్నారని, ఇది మంచిది కాదని హితవు చెప్పారు. అధిక ధరకు భూములు కౌలుకు తీసుకోవడం, బ్యారన్లు అద్దెకు తీసుకోవడం వంటివి చేస్తున్నారని, వచ్చే ఏడాది కూడా మార్కెట్ ఇదే విధంగా ఉంటుందని ఎవ్వరూ చెప్పలేమని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బోర్డు అనుమతించిన మేరకే పొగాకు ఉత్పత్తి చేయాలని దామోదర్ సూచించారు. అదనపు పొగాకు కొనుగోళ్లపై 5 శాతం అపరాధ రుసుం రద్దు చేయడం ద్వారా రాష్ట్రంలోని రైతులకు సుమారు రూ.111 కోట్ల మేర మేలు జరిగిందన్నారు. రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని 5 వేలం కేంద్రాల పరిధిలోని 12,772 మంది రైతులకు సుమారు రూ.27 కోట్ల మేర ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే అపరాధ రుసుం రద్దు వర్తిస్తుందని స్పష్టం చేశారు. పండించిన పొగాకును బయట కాకుండా వేలం కేంద్రాల్లోనే అమ్ముకోవాలని దామోదర్ సూచించారు.

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజినల్ మేనేజర్ జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ, 2024–25 పంట కాలానికి బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిందని, దీనికి మించి ఉత్పత్తి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. రీజియన్‌లో 58.25 మిలియన్ల కిలోల పొగాకు ఉత్పత్తికి మాత్రమే అనుమతి ఇచ్చారని తెలిపారు.

127.75 మిలియన్ల కిలోల పొగాకు అమ్మకాలు

రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయని పొగాకు బోర్డు విస్తరణ మేనేజర్ దామోదర్ విలేకర్లకు తెలిపారు. రాష్ట్రంలో 2023–24 పంట కాలానికి 142 మిలియన్ల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా, 205 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ సుమారు రూ.3,500 కోట్ల విలువైన 127.75 మిలియన్ల కిలోల అమ్మకాలు జరిగాయన్నారు. రాష్ట్రంలోని అన్ని వేలం కేంద్రాల్లో కిలో పొగాకు సగటు ధర రూ.278.32 ఉందన్నారు. రాష్ట్రంలో 44 వేల మంది రైతులు పొగాకు పండిస్తున్నట్లు ఆయన చెప్పారు. తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 2023–24 సంవత్సరానికి 48.50 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, ఇప్పటి వరకూ 40 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయని, ఇంకా దాదాపు 27 మిలియన్ల కిలోలు రైతుల వద్ద అమ్మకానికి ఉందని వివరించారు.

భీఎస్ఎన్ఎల్



- పడి లేచిన కెరటంలా బీఎస్ఎన్ఎల్
- వినియోగదారుల్లో పెరుగుతున్న ఆదరణ
- ప్రతి రోజూ 1,200 కొత్త కనెక్షన్లు
- నెలాఖరుకు 30 వేల మైలురాయిని అధిగమించే అవకాశం
- 1,300 గ్రామాల్లో 4జీ సేవలు
- మరో 400 టవర్ల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రభుత్వ రంగ భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) పడి లేచిన కెరటంలా జూలు విదిలిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏళ్ల తరబడి తగినంత సహకారం లేక, ప్రైవేటు కంపెనీల పోటీని తట్టుకోలేక ఒకప్పుడు చతికిలపడిన ఈ సంస్థ దాదాపు ఒకటిన్నర దశాబ్దాల తరువాత పూర్వ వైభవం సంతరించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రైవేటు టెలికం సంస్థలు ఈ నెల మొదటి వారం నుంచి వాయిస్ కాల్, డేటా రేట్లు అడ్డగోలుగా పెంచేయడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒక్కసారిగా చార్జీలు పెంచేయడంతో భరించలేని వినియోగదారులు కొద్ది రోజులుగా క్రమంగా బీఎస్ఎన్ఎల్ వైపు మళ్లుతున్నారు. నెలకు రూ.200 రీచార్జితో ఇతర కంపెనీల వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ తన వైపు తిప్పుకుంటోంది. చార్జీలు పెంచిన కంపెనీలకు వినియోగదారులు గుడ్‌బై చెప్పి బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారు. రెండు వారాలుగా ఈ ప్రక్రియ వేగం పుంజుకోవడంతో బీఎస్ఎన్ఎల్ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామం తమ సంస్థకు పూర్వ వైభవం తీసుకుని వస్తోందని బీఎస్ఎన్ఎల్ అధికారులు, సిబ్బంది చెబుతున్నారు.

ప్రైవేటు రేటు.. కష్టమర్ల హీటు

వివిధ కారణాలతో ఎయిర్‌టెల్, జియో, ఐడియా వంటి కంపెనీలు రీచార్జి రేట్లు భారీగా పెంచేశాయి. రూ.249గా ఉన్న రీచార్జిని ఒకేసారి రూ.299కి పెంచేశాయి. అది కూడా నెల రోజులు కాకుండా 28 రోజులకే పరిమితం చేశాయి. ఉదాహరణకు బీఎస్ఎన్ఎల్‌లో నెలకు రూ.197 అవుతూంటే అదే ప్రైవేటు నెట్‌వర్క్‌లో రూ.349 అవుతోంది. ఇంత భారీగా చార్జీలు పెంచేయడంతో సామాన్యులకు భారమవుతోంది. ఒక ఇంట్లో ప్రైవేటు కంపెనీలకు చెందిన సిమ్‌లు వినియోగిస్తున్న వారు నలుగురుంటే నెలకు రూ.1,000 పైనే ఖర్చు చేయాల్సి వస్తోంది. అదే బీఎస్ఎన్ఎల్ వినియోగిస్తే వైఫై సౌకర్యంతో పాటు నాలుగైదు వందల రూపాయలకు మించి అవడం లేదు. పైగా ప్రైవేటు నెట్‌వర్క్ వాడుతున్నప్పుడు రేడియేషన్ ప్రభావమో ఏమో కానీ తలనొప్పి, కంటి సమస్యల వంటివి వస్తున్నాయని పలువురు అంటున్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మళ్లుతున్నారని అధికారులు చెబుతున్నారు.

ఊపందుకున్న ఎంఎన్‌పీ

ఇతర కంపెనీల నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారే మొబైల్ నంబర్ పోర్టబులిటీ (ఎంఎన్‌పీ) కొద్ది రోజులుగా జోరందుకుంది. దీంతో పాటు కొత్త బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు కూడా పలువురు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ సుమారు 1,200 మంది వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌ల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారుతున్నారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య ఈ నెలాఖరుకు 30 వేలకు చేరుతుందని చెబుతున్నారు. ఈ మైలురాయి దాటడం అంత ఆషామాషీ కాదని అంటున్నారు. బీఎస్ఎన్ఎల్‌కు ఇప్పుడున్న 5 లక్షల ప్రీపెయిడ్ కనెక్షన్లు భవిష్యత్తులో రెట్టింపయ్యే అవకాశం కూడా లేకపోలేదని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూరుమూల పల్లెలకు సైతం..

వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,300 గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను యుద్ధప్రాతిపదికన విస్తరిస్తోంది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ ఆత్మనిర్భర్ ప్రాజెక్టులో భాగంగా కల్పిస్తోంది. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) నిబంధనలకు అనుగుణంగా పరిమిత రేడియేషన్‌తో అదనపు 4జీ టవర్ల నిర్మాణం వేగవంతం చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4జీ టవర్లు మొత్తం 400 ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం కాగా.. ఇప్పటి వరకూ 60 టవర్లు ఏర్పాటయ్యాయి. వచ్చే డిసెంబరు నాటికి మిగిలిన 340 టవర్లు పూర్తి చేయాలనే సంకల్పంతో బీఎస్ఎన్ఎల్ అడుగులు వేస్తోంది. వీటితో కలిపి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్‌కు మొత్తం 832 టవర్లు సమకూరనున్నాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సమాచారం

బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు	:	81
ల్యాండ్‌లైన్ కనెక్షన్లు	:	11,000
ప్రీపెయిడ్ వినియోగదారులు	:	5,00,000
ఫైబర్ కనెక్షన్లు	:	20,000
లీజ్డ్ లైన్లు	:	1,500
ప్రస్తుతం ఉన్న టవర్లు	:	385
నిర్మాణంలో ఉన్నవి	:	45

వినియోగదారుల సంఖ్య బాగా పెరుగుతోంది



బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు వస్తున్న వినియోగదారుల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. ఇతర కంపెనీలు చార్జీలు పెంచడంతో వినియోగదారులపై భారం బాగా పెరిగింది. బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల నుంచి విడుదలయ్యే రేడియేషన్ ట్రాయ్ నిబంధనలకు అనుగుణంగానే ఉంటుంది. ప్రైవేటు కంపెనీలు ట్రాయ్ నిబంధనలకు విరుద్ధంగా రేడియేషన్ పెంచుకుంటూ పోతున్నాయి. దీనివలన వాతావరణ సమతుల్యత దెబ్బ తింటోంది. పైగా అనారోగ్య సమస్యల వంటి కారణాలతో కూడా ఎక్కువ మంది బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

– పలివెల శ్రీరాజు, ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో తాపీమేస్త్రీ మృతి


మృతుడు అప్పారావు

పెదపూడి: జి.మామిడాడలో ఒక ఇంటి నిర్మాణ పనిచేస్తున్న తాపీ మేస్త్రీ ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్ తగిలి మృతి చెందాడు. ఇన్‌చార్జి ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. జి.మామిడాడ గ్రామానికి చెందిన కట్టా శ్రీను ఇంటి నిర్మాణ పనిని అదే గ్రామానికి చెందిన దెయ్యాల అప్పారావు(48), వాసపు శ్రీనివాస్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్పారావు ఇనుప ఊచను వంచుతుండగా ప్రమాదవశాత్తూ సమీపంలోని విద్యుత్ స్తంభానికి ఉన్న వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వాసపు శ్రీనివాసు చేతికి గాయాలయ్యాయి. మృతుడు అప్పారావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీనివాసు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యవసాయ కూలీ మృతి

ప్రత్తిపాడు: గడ్డిమందు తాగి వ్యవసాయ కూలీ మృతి చెందిన ఘటన ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామంలో జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు వ్యవసాయ కూలీ పనులు చేసే మింగి భద్రం (42) గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి, తాను గడ్డిమందు తాగానని తన భార్య శాంతకుమారికి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఏలేశ్వరం మండలం చిన్నింపేట వరకు బైక్‌పై తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 108 వాహనంలో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ప్రత్తిపాడు ఏఎస్సై ఆర్‌ఏఎస్ మూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ దాష్టీకానికి వైఎస్సార్ సీపీ నేత బలి


వీరబాబు అంతిమయాత్రలో పాడె మోసిన దవులూరి దొరబాబు


వేట్లపాలెంలో పరిస్థితిని సమీక్షిస్తున్న డీఎస్పీ లతాకుమారి


పెద్దాపురం ఏరియా ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులతో ధర్నా చేసిన దొరబాబు తదితరులు

- సోషల్ మీడియాలో వేధించడంతో ఆత్మహత్య చేసుకున్న వార్డు సభ్యుడు
- పార్టీ చురుకైన వాడిని కోల్పోయిందని పలువురి ఆవేదన
- నియోజకవర్గ కో ఆర్డినేటర్ దొరబాబు ఆధ్వర్యంలో నిరసన
- వేట్లపాలెంలో ఉద్రిక్తత, మృతదేహంతో ఆస్పత్రి వద్ద ధర్నా
- పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ చూపడంతో ఆందోళన విరమణ

సామర్లకోట: టీడీపీ దాష్టీకానికి పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఒక చురుకైన నాయకుడిని కోల్పోయింది. వేట్లపాలెం గ్రామ పంచాయతీ 10వ వార్డు సభ్యుడు బొబ్బిలి వీరవెంకట సత్యనారాయణ(వీరబాబు) (34) శుక్రవారం ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ నాయకులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వీరబాబు కొంతకాలంగా సోషల్ మీడియాలో వస్తున్న వేధింపులు, బెదిరింపులతో భయపడేవాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు చెప్పి మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. సోషల్ మీడియాలో వస్తున్న వేధింపులు వీరబాబు ఆత్మహత్యకు దారి తీస్తాయని భావించలేదని స్నేహితులు, కుటుంబ సభ్యులు అంటున్నారు. అధికార పార్టీకి చెందిన తెలుగుదేశం నాయకుల వేధింపుల కారణంగానే వీరబాబు ఫ్యానుకు ఉరి పోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలు రావడంతో పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో సమాచారం సేకరించారు. కుమారుడు మృతి చెందడంతో తల్లి మంగ, తండ్రి ఎరుకులనాయుడు బంధువులు మృతదేహం వద్ద బోరున విలపించారు. వీరబాబు మృతి చెందిన వార్త తెలిసి అతని బంధువులు, స్నేహితులు తరలి వచ్చారు. దీంతో గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దాంతో డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో సీఐ అంకబాబు పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తండ్రి ఎరుకులనాయుడు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న వేధింపుల కారణంగా తన కుమారుడు మానసికంగా బాధపడుతూ ఉండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోస్టింగ్‌లు పెడుతున్న వారి పెద్దల వద్దకు వెళ్లి ప్రాధేయపడినా ఫలితం కనిపించలేదన్నారు. అన్నదమ్ములకు ఒకే మగ బిడ్డ కావడంతో ఎంతో గారాబంగా పెంచుకున్నామని ఎరుకులనాయుడు బోరున విలపించారు. ఇటువంటి కడుపు కోత మరెవ్వరికీ రాకూడదంటూ తల్లి మంగ రోదించింది.

పెద్దాపురం ప్రభుత్వాస్పత్రి వద్ద ఉద్రిక్తత

మృతదేహాన్ని పెద్దాపురం ఏరియా ఆస్పత్రికి తరలించడంతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు చేరుకున్నారు. దాంతో ఆస్పత్రి వద్ద ఉద్రికత్త పరిస్థితి ఏర్పడింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన తీవ్రంగా ఉంటుందని పార్టీ నాయకులు హెచ్చరించారు. మృతుని తండ్రి ఎరుకులనాయుడు ఫిర్యాదు మేరకు 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ లతాకుమారి చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహంతో ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులతో కలిసి దవులూరి దొరబాబు, పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకుల వేధింపుల కారణంగా వీరవెంకటసత్యనారాయణ ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. వేధింపులకు గురి చేసిన నాయకులు, కార్యకర్తలు గ్రామంలోనే తిరుగుతున్నారని వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో చురుకైన పార్టీ నాయకుడిని కొల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ అనంతరం నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పిన పోలీసులు, 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని అందజేయడంతో పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు. అనంతరం వీరబాబు అంత్యక్రియలు వేట్లపాలెంలో నిర్వహించారు. అంతిమయాత్రలో వీరబాబు పాడెను దవులూరు దొరబాబు మోశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్ మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, ఆంధ్రమాల మహానాడు నాయకులు లింగం శివకుమార్, బీపెల్లి పండు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు వేధిస్తున్నారనే చెప్పేవాడు



కొంత కాలంగా నా సోదరుడు వీరవెంకటసత్యనారాయణ మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. కారణం అడిగితే గ్రామానికి చెందిన కొంతమంది తెలుగుదేశం నాయకులు సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టింగ్‌లు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నాడని బాధపడేవాడు. అయితే ఆ ఫొటోలు చూపమంటే చూపలేదు.

– దేవి, మృతుని సోదరి, వేట్లపాలెం

గ్రామం వదలి వెళ్లమన్నాం



టీడీపీ నాయకులు వేధింపులకు భయపడటంతో నా బావమరిది అయిన వీరవెంకట సత్యనారాయణను గ్రామం విడిచి బంధువులు ఉన్న విశాఖపట్నం వెళ్లాలని సూచించాం. సరే అని అంగీకరించిన రెండు రోజులకే ఆత్మహత్య చేసుకున్నాడు.

– కర్రి సతీష్‌కుమార్, వేట్లపాలెం

10 కాసుల బంగారం, నగదు అపహరణ

జగ్గంపేట: మండలంలోని రాజపూడి గ్రామంలో ఒక ఇంటిలో బీరువాలు తెరిచి 10కాసుల బంగారం, కొంత నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. జగ్గంపేట ఇన్‌చార్జి ఎస్ఐ బలరాం కథనం ప్రకారం సిదిరి శివదుర్గ బొడ్డువారి వీధిలో నివసిస్తున్నాడు. గురువారం తన బంధువు జగ్గంపేటలో మృతి చెందాడని తెలియడంతో హడావుడిగా ఇంటికి గడియవేసి బయలుదేరాడు. ఇంటికి తన తల్లి తాళం వేస్తుందని భావించాడు. అయితే అతని తల్లి, తండ్రి కూడా ఇంటికి తాళం వేయకుండా జగ్గంపేట వచ్చేశారు. జగ్గంపేటలో కార్యక్రమాలు ముగించుకుని శివదుర్గ చేరుకునే సరికి ఇంట్లో బీరువాలు తెరిచి వుండడం, చోరీ అయిన సంగతి గమనించి శుక్రవారం జగ్గంపేటలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే చోరీ

రూ.3 లక్షల నగదు, 20 కాసుల బంగారం వస్తువుల మాయం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో పట్టపగలే చోరీ జరిగింది. ఓ పక్క ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరోవైపు దర్జాగా ఇంటిలోకి ప్రవేశించిన అగంతకులు తాళాలు తెరుచుకుని, చోరీకి పాల్పడ్డారు. బీరువా, అల్మారా తలుపులు తెరిచి, వాటిలో ఉన్న రూ.3 లక్షల నగదు, 20 కాసుల బంగారం వస్తువులను దోచుకుని ఉడాయించారు. బాధితుల, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన ముచ్చకర్ల అప్పలస్వామి దేవీపట్నం మండలం ఇందుకూరిపేట పీహెచ్‌సీలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నాడు. ఇతను కుటుంబంతో సహా స్థానిక అగ్నిమాపక కేంద్రం సమీపాన గల తన స్వంత ఇంటిలో నివసిస్తున్నాడు. గురువారం ఉదయం అప్పలస్వామి విధుల నిర్వహణకు వెళ్లాడు. అనంతరం అతని భార్య సూర్యకాంత ఇంటి తలుపులకు తాళం వేసి, స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా తమ మామగారు చిట్టిబాబు నిర్వహిస్తున్న పాన్‌షాపు వద్దకు అతనికి సాయంగా ఉండేందుకు వెళ్లింది. ఇంటి మెయిన్ డోర్ తాళం మాత్రం బయట కిటికీలో ఉంచింది. ఇది రోజూ జరిగే తంతు. ఇంటి పైభాగంలో తాపీ పనులు చేయిస్తున్నారు. కూలీలంతా మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిన అప్పలస్వామి యథావిధిగా మెయిన్‌డోర్ తాళం తీసుకుని, లోపలికి వెళ్లగా చోరీ జరిగినట్టు గుర్తించాడు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీకి పాల్పడిన అగంతకులు కిటికీలో ఉన్న తాళంతో మెయిన్‌డోర్ తెరిచి, లోనికి చొరబడ్డారు. ఇంటిలో కప్‌బోర్డులో ఉన్న బీరువా తాళాలతో బెడ్‌రూంలోని బీరువా, కబ్ బోర్డులను తెరిచారు. వాటిలో ఉన్న రూ.3 లక్షల నగదు, బంగారు చెవిదుద్దులు, గొలుసు, బ్రాస్‌లెట్, నల్లపూసల దండ, చెవి రింగులు తదితర 20 కాసుల బంగారు ఆభరణాలను దోచుకుపోయారు. ఇంటి వెనుక తలుపులు తెరుకుని పరారయ్యారు. అయితే మెయిన్‌డోర్‌కు తాళం వేసి, తాళం చెవులను యథాతథంగా బయట కిటికీలో పెట్టి ఉడాయించారు. రాత్రి వచ్చిన డాగ్ స్క్వాడ్ గ్రామం శివారు కొండ మలుపు నుంచి పుంత మార్గం గుండా జాతీయ రహదారి వరకు వెళ్లింది. ఉదయం నుంచీ క్లూస్ టీం ఆధారాలను సేకరిస్తోంది. ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


ప్రత్తిపాడులో చోరీ జరిగిన ఇంటిలో చెల్లాచెదురుగా ఉన్న వస్తువులు


ప్రత్తిపాడులో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

మహిళపై కత్తితో దాడి

పిఠాపురం: పాత గొడవల నేపథ్యంలో ఓ మహిళపై ఒక వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన ఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గొల్లప్రోలుకు చెందిన వేమగిరి రాజేష్ అలియాస్ సతీష్‌కు, అదే గ్రామానికి చెందిన నేకూరి రాజ్యలక్ష్మికి మధ్య పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఇద్దరి మధ్య చిన్న వివాదం మొదలై, చినికి చినికి గాలివానగా మారింది. ఈ క్రమంలో రాజేష్ తన వెంట తెచ్చుకున్న కత్తితో రాజ్యలక్ష్మిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. కత్తిపోట్లతో ఆమె శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను పోలీసులు తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై గొల్లప్రోలు ఎస్సై జానీ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు గతంలో అతని మేనమామ ద్రాక్షారపు భూషణంపై దాడి చేసినట్టు కేసు నమోదు అయిందని, అతడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై తెలిపారు.

వెండి ఆభరణాల రికవరీ


విలేకరులతో మాట్లాడుతున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి ఆభరణాలు

- నిందితుడి అరెస్ట్
- కాకినాడ డీఎస్పీ హనుమంతరావు వెల్లడి


నిందితుడు రాములు నాయక్

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఈ నెల 5వ తేదీన ఆలయంలో జరిగిన చోరీ ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి వెండి ఆభరణాలు రికవరీ చేశామని కాకినాడ డీఎస్పీ కె.హనుమంతరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ జి.మామిడాడ గ్రామ శివారు సూర్యనారాయణపురంలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో సుమారు 14కేజీల వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. దీనిపై అప్పటి ఎస్సై శోభన్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఘటనా స్థలిలోని సీసీ కెమెరా, క్లూస్‌టీమ్, వేలి ముద్రలు, డాగ్ స్క్వాడ్ సాయంతో నిందితుడిని గుర్తించారు. సికింద్రాబాద్ తుకారం గేట్ వద్ద ఉండే అముగోతు రాములు నాయక్‌ను కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద గురువారం అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అతని వద్ద నుంచి 14 కిలోల వెండి ఆభరణాలు కవచాలు, హరాండీ, ఉత్సవ విగ్రహాల మంగళసూత్రాలు రికవరీ చేసి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. నిందితుడిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 15 పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు అయి ఉన్నాయన్నారు. పలుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడన్నారు. చెడు వ్యవసనాలకు అలవాటు పడిన నిందితుడు దేవుని ఆలయాల్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు చోరీలు చేస్తున్నాడన్నారు. ఈ కేసులో త్వరగా నిందితుడిని పట్టుకోడానికి కృషి చేసిన పోలీసులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందనలు తెలిపారన్నారు. దేవాలయాల్లో సీసీ కెమెరాలు లేకపోతే వెంటనే అమర్చుకోవాలన్నారు. సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ ఏ సన్యాసిరావు, క్రైమ్ సీఐ వై.చిట్టిబాబు, ఇన్‌చార్జి ఎస్సై రామకృష్ణ, ఏఎస్సై వి.శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమోలులో పోలీసు పికెట్

- వివాదాస్పద భూముల వ్యవహారంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం
- పోలీసులు కొనుగోలు దారుల కొమ్ము కాస్తున్నారంటున్న పట్టాదారుల తరఫు న్యాయవాది


వివాదాస్పద భూమి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న న్యాయవాది విజయభాస్కరరెడ్డి

గోపాలపురం: మండలంలోని భీమోలులో భూవివాదాలు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసశర్మ సుమారు 50 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ సుమారు 360 ఎకరాల భూమిపై పట్టాదారులకు, కౌలుదారులకు మధ్య కోర్టు వివాదాలు జరుగుతున్నాయి. ఇటీవల విజయదుర్గా ఆగ్రో ఏజెన్సీ పేరుపై వివాదాల్లో ఉన్న కొంత భూమిని రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ చేయడంతో క్రయవిక్రయాలు జరిగాయి. దీనిపై సీనియర్ న్యాయవాది కె.విజయభాస్కరరెడ్డి పట్టాదారుల పక్షాన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో న్యాయ వాది విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ హైకోర్టులో పెండింగ్ ఉన్న భూములను సాగు చేయడానికి వచ్చిన వారికి పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకుని కొనుగోలు చేసిన వారిని పోలీసులు ప్రోత్సహించి పట్టాదారులను చిత్రహింసలకు గురిచేస్తున్నారని అన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ఎస్‌కే ఖాదర్ వల్లీ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా భీమోలు జమీందార్‌కు చెందిన 360 ఎకరాలు పట్టాదారులు సాగు చేసుకుంటున్నారని 2017లో కొంతమంది వ్యక్తులు పట్టాదారుల భూములపై కన్నేసి పట్టాదారుల స్థానంలో కౌలుదారులను సృష్టించి జమీందారు భూములను కౌలుదారులకు చెందేలా కోర్టు నుంచి అనుమతులు తీసుకున్నారని ఆరోపించారు. కౌలుదారులు ఎప్పటికీ భూమిమీద ఉండాలి తప్ప క్రయవిక్రయాలు చేయకూడదు. రెవెన్యూ అధికారులు కౌలుదారులతో కుమ్మక్కు అయి కౌలుదారులకు చెందిన భూములను ఆన్‌లైన్ చేసి వేరే వ్యక్తులకు విక్రయించడం పట్టాదారులను తీవ్రంగా మోసం చేయడమేనని అన్నారు. దీనిపై దేవరపల్లి సీఐ పి.బాలసురేష్‌ను వివరణ కోరగా భీమోలు వివాదాస్పద భూములపై రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు.